# మన చౌరాస్తా


తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 148 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | ఆదివారం, 26 ఏప్రిల్ 2026 | పేజీలు : 4





లావణ్య త్రిపాఠి రీ ఎంట్రీ.. 4

# టీఆర్ఎస్

## తెలంగాణ రాష్ట్ర సేన

- తెలంగాణ రాజకీయ యవనికపై కొత్త పార్టీ
- కవిత సారథ్యంలో ఆవిర్భావం
- తెలంగాణ కోసం పిడికిలి బిగించి కొట్లాడినం
- నా చెమటను చిందించి.. పోరాటం చేశా
- సామాజిక తెలంగాణ కల సాకారం కాలేదు
- తెలంగాన కోసం పోరాడిన వారంతా మోసపోయారు
- మునుపటి కేసీఆర్..ఇప్పుడు లేడన్నది సత్యం
- అందుకే ప్రజల పక్షాన.. ప్రజల కోసం టీఆర్ఎస్‌తో వచ్చా
- పార్టీ పేరు, జెండా, ఎజెండాను ప్రకటించిన కవిత

తెలంగాణ రాజకీయ యవనికపై కొత్త పార్టీ ఆవిర్భవించింది. కల్వకుంట్ల కవిత నూతన రాజకీయ పార్టీని ప్రకటించారు. 'తెలంగాణ రాష్ట్ర సేన'గా నామకరణం చేశారు. ఈ మేరకు మేడ్చల్ జిల్లా మునీరాబాద్‌లో ఏర్పాటు చేసిన భారీ సభలో పార్టీ పేరును కవిత ప్రకటించారు. అనంతరం కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగిస్తూ.. రాష్ట్రంలో ఉన్న మూడు పార్టీలు తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడం లేదన్నారు. బిఆరఎస్ పదేళ్ల అవినీతి, కాంగ్రెస్ మోసం, బిజెపిల చేతగానితనం కారణంగా తెలంగాణ రాష్ట్రస సేన ఏర్పాటు తప్పలేదన్నారు. ఈ మూడు పార్టీలకు వ్యతిరేకంగా పోరాడడమే ఎజెండగా ఐదు ప్రధాన హామీలతో పాంచజన్యం పూరించారు. *- హైదరాబాద్, మన చౌరాస్తా*


2 లో





# మన పార్టీ.. టీఆర్ఎస్

## తెలంగాణ రాష్ట్ర సేన

- తెలంగాణ రాజకీయ యవనికపై కొత్త పార్టీ
- కవిత సారథ్యంలో ఆవిర్భావం
- తెలంగాణ కోసం పిడికిలి బిగించి కొట్లాడినం
- నా చెమటను చిందించి.. పోరాటం చేశా
- సామాజిక తెలంగాణ కల సాకారం కాలేదు
- తెలంగాన కోసం పోరాడిన వారంతా మోసపోయారు
- మునుపటి కేసీఆర్..ఇప్పుడు లేడన్నది సత్యం
- అందుకే ప్రజల పక్షాన.. ప్రజల కోసం టీఆర్ఎస్‌తో వచ్చా
- పార్టీ పేరు, జెండా, ఎజెండాను ప్రకటించిన కవిత



**హైదరాబాద్, మన చౌరాస్తా :** తెలంగాణ రాజకీయ యవనికపై కొత్త పార్టీ ఆవిర్భవించింది. కల్వకుంట్ల కవిత నూతన రాజకీయ పార్టీని ప్రకటించారు. 'తెలంగాణ రాష్ట్ర సేన'గా నామకరణం చేశారు. ఈ మేరకు మేడ్చల్ జిల్లా మునీరాబాద్‌లో ఏర్పాటు చేసిన భారీ సభలో పార్టీ పేరును కవిత ప్రకటించారు. అనంతరం కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగిస్తూ.. రాష్ట్రంలో ఉన్న మూడు పార్టీలు తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడం లేదన్నారు. బీఆరఎస్ పదేళ్ల అవినీతి, కాంగ్రెస్ మోసం, బిజెపిల చేతగానితనం కారణంగా తెలంగాణ రాష్ట్రస సేన ఏర్పాటు తప్పలేదన్నారు. ఈ మూడు పార్టీలకు వ్యతిరేకంగా పోరాడడమే ఎజెండగా ఐదు ప్రధాన హామీలతో పాంచజన్యం పూరించారు. ఏ కలలతో తెలంగాణ తెచ్చుకున్నామో అవి నిజం కాలేదన్నారు. తను తెలంగాణ కోసం అనేక కష్టాలు పడి.. పిడికిలి బిగించి కొట్లాడామన్నారు. జాగృతి కార్యకర్తలు తెలంగాణ సాంస్కృతిక దీపాన్ని పదిలంగా కాపాడుకున్నారని చెప్పారు. కాళరాత్రిలో కాగడా వలే తెలంగాణ ఉద్యమకారులకు తెలంగాణ జాగృతి ఉద్యమకారులకు వెలుగునిచ్చింది. తెలంగాణ సమాజానికి కాంతిరేఖగా మారింది. మరోసారి బతుకమ్మను ప్రపంచానికి పరిచయం చేసుకున్నాం. ఇవాళ నా జీవితంలో మరిచిపోలేని రోజు అవుతుంది. తెలంగాణ భవిష్యత్ రాసుకోవడానికి మనందరి భాగస్వామ్యం కావాలి. కేసీఆర్ సారథ్యంలో తెలంగాణ ఉద్యమ రథం దారి తప్పింది. బీఆరఎస్ రాష్ట్ర ప్రజల ఆర్తిని అర్థం చేసుకోలేకపోయింది. సామాజిక తెలంగాణ రథచక్రం విరిగి ముక్కలైంది. కొత్త రాష్ట్రంలో జరగాల్సిన పనులు సరిగా జరగలేదు. తెలంగాణ వస్తే బానిస సంకెళ్లు పోతాయని భావించాం. కానీ, రైతులకు బేడీలు పడ్డాయి.. ఇసుక దందా వల్ల దళితులు దెబ్బలు తిన్నారు. ఫోన్లు ఎక్కడ వింటున్నారోనని భయం.. వ్యక్తిగత స్వేచ్ఛ లేదు. దారుణమైన నిఘా నీడలో తెలంగాణ అంతా బతికింది. మనం అనుకున్న తెలంగాణ రాలేదనేది ముమ్మాటికీ వాస్తవం. ఆనాడు పరిపాలించిన కుటుంబంలో నేను కూడా ఒక భాగం. అందుకే కొన్ని విషయాల్లో సిగ్గుపడుతున్నా. తెలంగాణ ప్రజలను క్షమించాలని కోరుతున్నా అని ప్రకటించారు. తెలంగాణ సాధించినందుకు చాలా గర్వపడుతున్నా. జన్మధన్యమైందని భావిస్తున్నా. కానీ, తప్పులో నాకూ భాగం ఉన్నందుకు క్షమాపణ చెబితే సరిపోదు. సామాజిక తెలంగాణ కోసం నడుం బిగించి కష్టపడి పని చేయాలి. పని చేయడం కోసమే తెలంగాణ రాష్ట్ర సేన (టీఆరఎస్) ప్రజల ముందుకు వచ్చిందని అన్నారు. మా పని తీరు ఎలా ఉంటుందో ప్రజలు చూస్తారు. ప్రజలకు మంచి చేయాలంటే పోరాడితే సరిపోదు.. రాజకీయ అధికారం ఉండాలి. అది తోడైతేనే ప్రజలకు మంచి చేయగలం. ఏ పార్టీకైనా ఆత్మ, నేపథ్యం ఉండాలి. బీఆరఎస్ సాంకేతికంగా ఉన్నా ఆత్మను కోల్పోయింది. బీఆరఎస్ ఆత్మ కోల్పోయినందుకే తెలంగాణ రాష్ట్ర సేన వచ్చింది. నాటి టీఆరఎస్ కోసం నా రక్తం, చెమట, సమయం ధారపోశా. పార్టీ బలోపేతం కోసం పని చేశా. ఆనాటి కేసీఆర్ వేరు.. ఇప్పటి కేసీఆర్ వేరు. చేనేత కార్మికులు చనిపోతుంటే.. ఆనాటి కేసీఆర్ భిక్షాటన చేశారు. ఇవాల్టి కేసీఆర్ మారిన మనిషి.. మర మనిషి.. మన మనిషి కాదు. ఎక్కడ చిన్న కష్టం వచ్చినా ఆ సార్ రారు.. ఎందుకంటే ఆయన మారిన మనిషి. గుంటనక్కలు, తోడేళ్ల చేతిలో కేసీఆర్ ఖైదీ అయ్యారు. పంజాబ్, గుజరాత్, బిహార్ వెళ్లి జాతీయ పార్టీ పెట్టాలని చూశారు. కేంద్రంతో గొడవ పెట్టుకోకుండా ఉండి ఉంటే పాలమూరు పూర్తయ్యేది. నేను ఎన్ని మాట్లాడినా బీఆరఎస్ నేతలు బయటకు వచ్చి జవాబివ్వట్లేదు. సమాధానం చెప్పకపోతే.. ప్రజలే బయటకు లాగి జవాబు చెప్పేలా చేస్తారని కూడా చిన్న హెచ్చరిక చేశారు. తెలంగాణలోని 3.5 కోట్ల మందికి అమ్మగా పరిణతి చెందాలనుకుంటున్నా. అమ్మతనంతో పాలన చేస్తేనే బిడ్డలకు కష్టం వస్తే తీరుస్తుంది. తెలంగాణలో ఏళ్ల తరబడి భూస్వామ్య వ్యవస్థ నడిచింది. ఎందరో మహనీయులు పోరాడితే కొంత సమానత్వం వచ్చింది. మలిదశ ఉద్యమంలో కేసీఆర్, ఉద్యమకారులు పోరాడితే కొత్త రాష్ట్రం వచ్చింది. రాజకీయ శక్తితో పోరాటాలు మిళితం చేసి సామాజిక న్యాయ తెలంగాణ సాధిస్తాం. భాజపాకి రాష్ట్ర ఏర్పాటే ఇష్టం లేదు. 'తల్లిని చంపారు.. పిల్లను బతికించారని' ఒకరు అన్నారు. భారత్, పాక్ విడదీసినట్లు తెలుగు రాష్ట్రాలను విభజించారని మరో ఎంపీ చెప్పారు. అయినా, భాజపా బానిస ఎంపీలు ఒక్క మాట మాట్లాడలేదు.

తెలంగాణ నుంచి 7 మండలాలు లాక్కుంటే భాజపా ఎంపీలు మాట్లాడరు. విభజన హామీలు నెరవేర్చకపోతే భాజపా ఎంపీలు మాట్లాడరు. సామాజిక న్యాయానికి బద్ధ వ్యతిరేకి భాజపా. తెలంగాణ భాజపా ఎంపీలకు సవాల్ విసురుతున్నా.. తెలంగాణ తల్లి బిడ్డలైతే ఏపీలో కలిసిన కనీసం 5 గ్రామాలను వెనక్కి వచ్చేలా చూడాలి. భద్రాచలం వద్ద ఉన్న 5 గ్రామాలు పోతే రాముడి గుడి మునుగుతుంది. గ్రామాలను వెనక్కి తీసుకురావడానికి జాగృతి తరఫున కేంద్రానికి లేఖ రాశాం. మూడు పార్టీలపై అలుపెరగని పోరాటానికి కార్యకర్తలంతా సిద్ధం కావాలని కవిత అన్నారు.








# మలేరియాపై అవేర్నెస్ ర్యాలీ

**జనగామ, మన చౌరాస్తా :** ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా జంగామ జిల్లాలో మలేరియా నివారణ, నియంత్రణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు నెహ్రూ పార్క్ నుండి బస్ స్టాండ్ ఎక్స్ రోడ్స్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని జిల్లా జెడ్పీ సీఈఓ శ్రీ రంగారావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. కె.మల్లికార్జున్ రావు, మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్ రెడ్డితో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ డా. కె. మల్లిఖార్జున్ రావు మాట్లాడుతూ మలేరియా వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించడం, పూర్తిస్థాయి చికిత్స తీసుకోవడం, ప్రజల్లో అవగాహన పెంపొందించడం ఎంతో ముఖ్యమని తెలిపారు. అలాగే మలేరియా రహిత భారతదేశం సాధనలో ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని పేర్కొన్నారు. ర్యాలీలో ప్రోగ్రాం అధికారులు, యూపీహెచ్‌సీ, బీడీకే వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ప్రభుత్వ నర్సింగ్ పాఠశాల విద్యార్థులు, కళాజాత బృందం, ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు.



## రైతులను నిలువు దోపిడి చేస్తున్న

# కాంగ్రెస్ ప్రభుత్వం

**బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు పెరుమాండ్ల**

**జాఫర్‌గడ్, మన చౌరాస్తా :** జాఫర్ గడ్ మండలం తిమ్మంపేట గ్రామంలో కిసాన్ మోర్చ మండల అధ్యక్షులు అబ్బరాబోయిన యాకస్వామీ గారి ఆధ్వర్యంలో ఐకెపి సెంటర్ ను సందర్శించిన బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు,కాంటెస్టెడ్ ఎమ్మెల్యే , స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ ఇంచార్జీ పెరుమాండ్ల వెంకటేశ్వర్లు (వెంకన్న) అనంతరం బిజెపి మండల అధ్యక్షులు కోరుకొప్పుల నాగేష్ గౌడ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో పెరుమాండ్ల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం అనేక సదుపాయాలు కలిగించిన రాష్ట్ర ప్రభుత్వం వారికి అందనివ్వడం లేదు. కేంద్రం సూచించిన ఏ ఒక్క సూచన కూడా ఐకెపి సెంటర్లు పాటించడం లేదు IKP సెంటర్ లో వాడే ప్రతి మిషన్ కోసం కేంద్రం డబ్బులు విడుదల చేస్తుంది అయిన కూడా రైతుల నుండి డబ్బులు వసూలు చేయడం దుర్మార్గం కరెంట్ చార్జీలు,మిషన్ ఛార్జీలు,సుతిలు దారాల చార్జీలు అంటూ రైతులను పీడించడం మరియు 40 కిలోల బస్తకి 150 గ్రామాలు తరుగు తియ్యడం అన్యాయం అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చ జిల్లా ఉపాధ్యక్షులు నేరేళ్ల రాజు,సోషల్ మీడియా మండల కన్వీనర్ కత్తి సందీప్ గౌడ్, SC మోర్చ మండల ప్రధాన కార్యదర్శి జూల రాజు,నారి శక్తి ఇంచార్జ్ ముస్కు స్వప్న,బూత్ అధ్యక్షులు మండల ప్రవీణ్ కుమార్‌నర్సింగోజ్ స్వామి రాజయ్య పాల్గొన్నారు.

## నేడు ఎంపీ చామల పర్యటన

**జనగామ, మన చౌరాస్తా :** భువనగిరి పార్లమెంట్ సభ్యులు ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి జనగామ జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు హాజరు కానున్నట్లు TGRTA మెంబెర్ చిలువేరు అభిగౌడ్ తెలిపారు.జనగామ, పెంబర్తి, వెల్దండ, నర్మేట్ట, తారిగొప్పుల,కూటిగల్ లో పర్యటించి పలు శంకుస్థాపనులు, ప్రారంభోత్సవాలు చేయనున్నట్లు ఈ కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, నాయకులు పాల్గొనాలని అభిగౌడ్ కోరారు.



# అలరించిన సంగీత విభావరి


**జనగామ, మన చౌరాస్తా :** జనగామ జిల్లా కేంద్రంలో శ్రీశారదా స్వరలహరి ఆధ్వర్యంలో నిర్వహించిన సంగీత విభావరి ఆహుతులను అలరించింది. శనివారం స్థానిక గౌతమ్ మోడల్ స్కూల్ ఆవరణలో నిర్వహించిన ఈ సంగీత విభావరికి ప్రముఖ గాయని, బ్యాంక్ ఆఫ్ బరోడా బెంగళూరు బ్రాంచ్ మేనేజర్ గొర్తి శ్యామల ప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సంగీత విభావరిలో పలువురు మెయిల్ సింగర్స్‌తో కలిసి శ్యామల ప్రసాద్ దాదాపు 60 పాటలు పాడారు. ఉదయం



9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సాగిన సంగీత విభావరితో పాఠశాల ప్రాంగణం హోరెత్తిపోయింది. కార్యక్రమంలో శారదా స్వరలహరి గౌరవ సలహాదారు మోతె సురేందర్ రెడ్డి, అధ్యక్షులు శ్రీబాష్యం విష్ణుచరణ్, కార్యదర్శి డి.అరవిందా చారి, కోశాధికారి జి.వి.ఎస్ గిరి, సభ్యులు గొర్తి దుర్గా ప్రసాద్, పోతు అనిల్ బాబు, ఉప్పలంచి నరేందర్, కొండ శ్రీనివాస్, ఎ.వెంకటేశ్వర్లు, రాజ్‌కుమార్, సరిత, సందెల రమేశ్, వీరస్వామి పాల్గొన్నారు. కాగా, కార్యక్రమానికి ముందుగా ప్రముఖ ఫ్లూటిస్ట్ వేణుమాధవ్ తన వేణుగానంతో ఆహుతులను అలరించారు.







# కిష్టయ్య మరణం పార్టీకి తీరని లోటు

**లింగాల ఘనపూరం, మన చౌరాస్తా :** జనగామ ప్రాంత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత అమరజీవి ఏసిరెడ్డి నరసింహారెడ్డి అనుచరుడు నవాబుపేట సిపిఎం ముఖ్య నాయకుడు పయ్యావుల కిష్టయ్య (84) మరణం సీపీఎం పార్టీకి ప్రజా ఉద్యమాలకు తీరని లోటని ఆ పార్టీ జనగామ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బొట్ల శేఖర్, జిల్లా కమిటీ సభ్యులు బూడిది గోపి అన్నారు. శనివారం ఉదయం వయోబార సమస్యలతో కిష్టయ్య మరణించారు. వారి గ్రామంలోని ఇంటి వద్ద వారి భౌతికకాయాన్ని సందర్శించి పార్టీ జెండాను కప్పి పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. ఈసందర్భంగా సిపిఎం గ్రామ శాఖ కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన సంతాప సభలో వారు పాల్గొని మాట్లాడుతూ కిష్టయ్య తన చిన్నతనములో సిపిఎం కమ్యూనిస్టు ఉద్యమాలకు ఆకర్షితులై ఏసిరెడ్డి గారి సహచర్యంలో లింగాల గణపురం మండలంలో పనిచేశారని నవాబుపేట కేంద్రంగా దొరలకు భూస్వాములకు వ్యతిరేకంగా రైతుల పక్షాన కష్టజీవుల పక్షాన అనేక ఉద్యమాలలో పాల్గొన్నాడని, ప్రజల నిత్య జీవితంలో వచ్చే సమస్యలను గ్రామంలో దగ్గరుండి పరిష్కారం చేసేవాడని, ఎవరికి ఏ ఆపద వచ్చినా ముందుండే గొప్ప వ్యక్తిత్వం కలిగిన వ్యక్తి కిష్టయ్యని, ఆయన మరణం నవాబుపేట గ్రామ ప్రజానీకానికి సిపిఎం ఉద్యమానికి తీరని లోటని అన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పోత్కనూరి ఉపేందర్, సిపిఎం మండల నాయకులు గండి అంజయ్య, తూటి దేవదానం, మబ్బు ఉప్పలయ్య, అక్యం ఉప్పలయ్య, అక్యం లచ్చయ్య, గోసుల అంజయ్య, రంపే అశోక్, పయ్యావుల సత్యనారాయణ, ఈర్ల చందు, ఇల్లందుల అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

# మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో అమ్మవారికి గంధోత్సవం

**వరంగల్, మన చౌరాస్తా :** వరంగల్ మహానగరంలో చరిత్ర ప్రసిద్ధిగాంచిన శ్రీ భద్రకాళీ దేవస్థానంలో శ్రీ భద్రకాళీ భద్రేశ్వరుల శ్రీ కళ్యాణ బ్రహ్మోత్సవాలు శనివారంతో ఏడవ రోజుకు చేరుకున్నాయి. ఉదయం అమ్మవారికి 4 గంటలకు నిత్యాహ్నికం నిర్వహించిన తదుపరి చతుఃస్థానార్చన జరిపిన తర్వాత అమ్మవారికి గంధోత్సవం, సాయంకాలం సాలభంజిక వాహనం పై అమ్మవారిని సామ్రాజ్యలక్ష్మిగా అలంకరించి ఊరేగింపు జరిపారు. అమ్మవారికి చందనోత్సవం జరుపడం వల్ల భక్తులకు శ్వాసకోశ సంబంధమైన చర్మ సంబంధమైన ఏలాంటి రుగ్మతలు ఉండవు. సాలభంజిక వాహనం మీద 32 మంది దేవకన్యలు వేసే ప్రశ్నల వర్షానికి ప్రత్యుత్తరమిస్తూ ఒక్కొక్క మెట్టు ఎక్కుతూ తన సర్వజ్ఞత్వాన్ని తెలుపుతుంది. సాలభంజిక వాహనం మీద సేవింపబడుతున్న అమ్మవారిని దర్శిస్తే సకల శక్తులు సమకూరుతాయి. విద్యా, ఐశ్వర్యం, పరాక్రమం, అధికారం అన్నీ సమకూరుతాయి. సామ్రాజ్యైశ్వర్యం కలుగుతుందని ఆలయ ప్రధానార్చకులు భద్రకాళి శేషు తెలిపారు. శనివారం గంధోత్సవ కార్యక్రమానికి వరంగల్ ఉమ్మడి జిల్లా మున్నూరు కాపు సంఘం వారు ఉభయదాతలుగా వ్యవహరించారు. ఆలయానికి విచ్చేసిన మున్నూరుకాపు సంఘం సభ్యులు వందలాదిగా వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు కటకం పెంటయ్య నేతృత్వంలో



ముఖ్య అతిథిగా కాంగ్రెస్ నాయకులు గోపాల నవీన్ రాజ్ దంపతులు మేళతాళాలతో పట్టుచీరలు, పూజాద్రవ్యాలు, పూలు, పండ్లు, పసుపు, కుంకుమలు అమ్మవారికి సమర్పించి పూజాదికములు నిర్వహించి అభిషేకములు నిర్వహింపజేశారు. నారీమణులు సామూహిక కుంకుమార్చనలు నిర్వహించిన అనంతరం 2000 మంది భక్తులకు మహా అన్నదానం గోపాల నవీన్ రాజ్ దాతగా వ్యవహరించి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మున్నూరు కాపు సంఘం ప్రముఖులలో మున్నూరు కాపు సంఘం గౌరవ అధ్యక్షులు గైనేని రాజన్, రాష్ట్ర అధ్యక్షులు కొండ దేవయ్య, భద్రకాళి దేవాలయ డైరెక్టర్లు మూగ శ్రీనివాస్, జారతి వెంకటేశ్వర్లు, తోగరు క్రాంతి,



మీసాల ప్రకాష్, మూలా రాంమూర్తి, కార్పోరేటర్లు ప్రవీణ్, ముస్కుమల్ల అరుణసుధాకర్, పల్లం పద్మరవి, కేడల పద్మ జనార్ధన్, పగడాల సతీష్, శ్రీబత్తుల నవీన్, కనుకుంట్ల రవికుమార్, బక్కి రాజ్ కుమార్, పాటి శ్రీనివాస్, మందాటి మహేందర్, పూజారి సత్యనారాయణ, మాడిశెట్టి వరుణ్, చందర్, తదితరులు పాల్గొన్నారు.




# 'తెలంగాణ రాష్ట్ర సేన' సభకు జనగామ నాయకులు

**జనగామ, మన చౌరాస్తా :** హైదరాబాద్‌లో జరిగిన తెలంగాణ రాష్ట్ర సేన (టీఆర్ఎస్) నూతన పార్టీ ఆవిర్భావ కార్యక్రమానికి జనగామ జిల్లా నుంచి విశేష స్పందన లభించింది.తెలంగాణ జాగృతి రాష్ట్ర నాయకులు అనంతుల ఆంజనేయులు ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా వివిధ మండలాలు, గ్రామాల నుంచి మొత్తం 42 బస్సుల్లో పెద్ద ఎత్తున ప్రజలు హైదరాబాద్‌కు తరలివెళ్లారు.ఈ కార్యక్రమంలో మహిళలు, యువకులు, ఉద్యమకారులు, రిటైర్డ్ ఉద్యోగస్తులు, మేధావులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.పార్టీ ఆవిర్భావాన్ని ఘనంగా నిర్వహిస్తూ, భవిష్యత్తులో ప్రజా సమస్యల పరిష్కారానికి నిత్యం ప్రజల పక్షాన పోరాటం చేస్తామని నాయకులు పేర్కొన్నారు. గత పాలకుల తప్పులను, ప్రస్తుత పాలకుల లోపాలను ఎప్పటికప్పుడు ప్రజల ముందు ఉంచుతూ, సామాజిక తెలంగాణ సాధనే లక్ష్యంగా ముందుకు సాగుతామని తెలిపారు. తెలంగాణ జాగృతి నాయకత్వంలో ఏర్పడిన ఈ టీఆర్ఎస్ పార్టీని ప్రజల హక్కుల కోసం బలమైన శక్తిగా తీర్చిదిద్దుతామని అనంతుల ఆంజనేయులు స్పష్టం చేశారు.ఈ సభలో అనంతుల ఆంజనేయులు, వీరన్న, గాండ్ల వెంకన్న, ఎడెల్లి సన్నీ, మూల ప్రభాకర్, పలాస సోమన్న, పొన్నం యాకన్న, విజయక్క, వెంకట్, లక్ష్మి, ప్రవళిక, ప్రత్యూష తదితరులు పాల్గొన్నారు.




## సతీ లీలావతిగా వస్తున్న

# లావణ్య త్రిపాఠి

టాలీవుడ్ ప్రముఖ నటి లావణ్య త్రిపాఠి మళ్లీ సినిమాలతో సందడి చేసేందుకు సిద్ధమయ్యారు. చాలాకాలం తర్వాత ఆమె నటించిన తాజా చిత్రం 'సతీ లీలావతి' ఈ వేసవిలో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. మెగా హీరో వరుణ్ తేజ్‌తో వివాహం, అనంతరం ఓ బిడ్డకు జన్మనిచ్చిన తర్వాత విడుదల అవుతున్న ఈ సినిమా కావడంతో అభిమానుల్లో ప్రత్యేక ఆసక్తి నెలకొంది. ఇప్పటికే ఈ చిత్రంపై మంచి బజ్ క్రియేట్ అయింది. ఆనంది ఆర్ట్ క్రియేషన్స్ సమర్పణలో, దుర్గాదేవి పిక్చర్స్ బ్యానర్‌పై నాగమోహన్ నిర్మించిన ఈ చిత్రానికి తాతినేని సత్య దర్శకత్వం వహించారు. గతంలో 'భీమిలి కబడ్డీ జట్టు', 'ఎస్ఎంఎస్ (శివ మనసులో శృతి)' వంటి యూత్‌ఫుల్ చిత్రాలతో గుర్తింపు పొందిన ఆయన, ఈసారి ఒక రొమాంటిక్ రిలేషన్‌షిప్ డ్రామాతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. లావణ్య త్రిపాఠి సరసన దేవ్ మోహన్ హీరోగా నటించగా, వీరిద్దరూ భార్యాభర్తలుగా కనిపించనున్నారు. ఈ సినిమా కుటుంబ బంధాలు, దాంపత్య జీవితం, వాటిలో వచ్చే సంఘర్షణలను వినోదాత్మకంగా చూపించనుందని నిర్మాత నాగమోహన్ తెలిపారు. హాస్యం, భావోద్వేగాలు కలగలిసిన ఈ చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునేలా రూపొందించబడిందని ఆయన పేర్కొన్నారు.ఇప్పటికే ఈ సినిమా సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకుని 'యూ' సర్టిఫికేట్‌ను పొందింది. మే 8న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు చిత్ర యూనిట్ ప్రకటించింది. తాజాగా విడుదల చేసిన పోస్టర్ ప్రేక్షకుల్లో ఆసక్తిని మరింత పెంచింది. ఈ చిత్రంలో సీనియర్ నటుడు నరేష్ వీకే, కమేడియన్ సప్తగిరి, తమిళ హాస్యనటుడు వీటీవీ గణేష్, రాజేంద్రన్, జాఫర్, జోషి తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. సంగీతాన్ని మిక్కీ జే. మేయర్ అందించగా, సినిమాటోగ్రఫీని బినేంద్ర మీనన్ నిర్వహించారు. ఎడిటింగ్ బాధ్యతలను సతీష్ సూర్య తీసుకున్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్, పాటలకు మంచి స్పందన లభించగా, త్వరలోనే ట్రైలర్‌ను విడుదల చేసి ప్రమోషన్స్‌ను మరింత వేగవంతం చేయనున్నట్లు చిత్ర యూనిట్ తెలిపింది. మొత్తానికి, 'సతీ లీలావతి'తో లావణ్య త్రిపాఠి సక్సెస్‌ఫుల్ రీఎంట్రీ ఇస్తారా అన్నది ఆసక్తికరంగా మారింది.

Printed and Published by **UPPALANCHI POORNIMA** on behalf of UPPALANCHI POORNIMA, Printed at Hamara Warangal Printers and Graphics H.no.25-8-182, Balaji Nagar, Kazipet, Warangal, 506003., Published at H.No.4-8-65, Dharmakancha, Jangaon, Jangaon District. Telangana, 506167, Editor : **UPPALANCHI NARENDER**. Ph : **8555800812**, RNI : **TGTEL/25/A4350**